క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పొన్నూరు: పట్టణ పరిధిలో బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు పలు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో ప్రజలకు ఆధార్ సేవలందించేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19, 20వ తేదీల్లో 27, 8వ వార్డు అంగన్‌వాడీ సెంటర్, 20, 21వ తేదీల్లో 25వ వార్డు శ్రీరామా ఎంపీఎల్ హైస్కూల్, 9వ వార్డు అంగన్‌వాడీ సెంటర్, 25, 26వ తేదీల్ల 11, 23వ వార్డు అంగన్‌వాడీ సెంటర్, 27,28వ తేదీల్లో 7, 22వ వార్డు అంగన్‌వాడీ సెంటర్లలో ఆధార్ శిబిరాలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి



కాకుమాను: ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు ఏప్రిల్‌లో నిర్వహించనున్న పరీక్షలకు సిద్ధం చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ కోరారు. మండలంలోని పెద్దివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 11వ తేదీ నుంచి 16 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు జమాయమ్మ, చలపతిరావు, హెచ్‌ఎం ఈవూరి శ్రీనివాసరావు, శంకరరావు పాల్గొన్నారు.

కసుకర్రులో గ్రామసభ



పొన్నూరు: మున్సిపాలిటీ పరిధిలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా మంగళవారం మండలంలోని కసుకర్రులోని రైతు సేవా కేంద్రం ఆవరణలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ నిర్వహించారు. గ్రామాన్ని పొన్నూరు మున్సిపాలిటీలో విలీనం చేయాలా.. వద్దా అనే అంశంపై గ్రామస్తుల నుంచి సంతకాల రూపంలో అభిప్రాయాన్ని సేకరించారు. అయితే మున్సిపాలిటీలో కలపడం వలన కలిగే ప్రయోజనాలు, నష్టాలను అధికారులు వివరించడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమయ్యాయి. పంచాయతీ కార్యదర్శి ఫహీమ్ బాషా పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాముల విగ్రహం ఏర్పాటు ప్రకటనపై హర్షం

నగరంపాలెం: అమరావతి రాజధానిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హర్షణీయమని అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుడివాడ రవీంద్రకుమార్ అన్నారు. కొత్తపేట ఫ్యాన్సీ కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి జరిగిన విలేకర్ల సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు మాట్లాడారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పొట్టి శ్రీరాముల జయంతి వేడుకల్లో భాగంగా అమరావతి రాజధానిలో 58 అడుగుల విగ్రహంతోపాటు శృతివనం, మెమోరియల్ స్థాపన చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం అభినందనీయమని అన్నారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఈసీ సభ్యులు కొనకళ్ల సత్యం, కోట శేషగిరిరావు, బోలిశెట్టి బాపారావు, వనమా నరేంద్ర, తల్లం శేఖర్, మహిళా నాయకులు ఓలేటి షర్మిల, టి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో చర్చా గోష్ఠి

లక్ష్మీపురం: అనేక రకాల సెస్సులు, సర్ చార్జిల పేరిట వసూలు చేసిన రూ.6 లక్షల కోట్లను రాష్ట్రాలకు ఇవ్వకుండా ఏ విధంగానూ ఉపయోగించకుండా వదిలేయడం కేంద్ర ప్రభుత్వ అసమర్థకు నిదర్శనమని విద్యావేత్త ఇ.చంద్రయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చ గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పన్నుల మాదిరిగా కాకుండా నిర్దేశిత అవసరాలు, ప్రయోజనాల రీత్యా, విధించే సెస్సులు,సర్ చార్జిలను కేంద్ర అవసరాల కంటే అదనంగా వసూలు చేశారన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాదరావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటరత్నం, సింగయ్య పాల్గొన్నారు.

రంజాన్‌ను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలి

లక్ష్మీపురం: రంజాన్‌ను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలనే ఆకాంక్షతో రంజాన్ తోఫాను అందించడం ఆనవాయితీగా వస్తుందని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి పేర్కొన్నారు. ఆనందపేటలోని ఆయన నివాసంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు రంజాన్ తోఫాను రెండో రోజు మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో మస్తాన్‌వలి సోదరుడు షరీఫ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కరీం, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు, అబ్దుల్ హనీఫ్ పాల్గొన్నారు.

అధ్వానంగా మురుగు కాలువలు

- దోమలతో సతమతం..
- ఫాగింగ్ చేస్తే ఒట్టు
- అల్లాడుతున్న ప్రజలు

పొన్నూరు: పట్టణంలో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పలు వీధుల్లోని డ్రెయిన్లు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి అధ్వానంగా మారాయి. దీంతో మురుగు ముందుకు కదలక.. ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదు. మొక్కుబడిగా అప్పుడప్పుడూ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా విద్యానగర్ కీర్తి హాస్పిటల్ రోడ్డుతో పాటు పలు వీధుల్లో వీధి కాలువలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల చిన్నపాటి కాలువలు కావడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలోని ప్రధాన్ డ్రెయిన్ ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలతో నిండి దోమలకు నిలయంగా మారింది. ప్రజారోగ్య విభాగం సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. దోమల కారణంగా రోగాలబారిన పడి సంపాదనలో సగం వైద్యానికి ఖర్చు చేస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 31 వార్డులలో ఫాగింగ్ నిర్వహణ కోసం ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారులు స్పందించి నిత్యం ఫాగింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



విద్యానగర్‌లో మట్టితో నిండిన కాలువ



వ్యర్థాలతో నిండిన మెయిన్ డ్రెయిన్

ఫాగింగ్ చేయడం లేదు

డ్రెయిన్లు చెత్త, చెదారం, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండిపోతున్నాయి. వ్యర్థాల కారణంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలకు నిలయంగా మారింది. సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదు. ఆయిల్ బాల్స్ వేయడం లేదు. ఫాగింగ్ చేయడం లేదు. అప్పుడప్పుడూ మొక్కుబడిగా ఫాగింగ్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలి.

– కనకారావు, పొన్నూరు

కాలువలకు మరమ్మతులు చేయాలి

కాలువలు దెబ్బతిని మురుగు కదలక దుర్వాసన వస్తుంది. సిబ్బంది మందు పిచికారీ చేయడం లేదు. దోమల తాకిడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జనాలు రోగాల బారిన పడుతున్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మట్టితో మూసుకుపోయిన కాలువలకు మరమ్మతులు చేసి ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్త తొలగించాలి.

– డి.లక్ష్మి, విద్యా నగర్

మానవ విలువలను కాపాడుకోవాలి

ఘనంగా వరల్డ్ సోషియల్ వర్క్ డే

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగంలో మంగళవారం వరల్డ్ సోషియల్ వర్క్ డేను విభాగాధిపతి ఆచార్య ఎం.త్రిమూర్తిరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్, డాక్టర్ ఎస్.ఎ.రెహమాన్ సాహెబ్ పాల్గొన్నారు. ఆచార్య ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో కనుమరుగవుతున్న మానవ సంబంధాల విలువలను తిరిగి వాటిని పునర్నించడంలో సోషల్ వర్క్ విద్యార్థుల బాధ్యత గురించి వివరించారు. మానవ సేవే – మాధవ సేవ అనే కేవలం సోషియల్ వర్క్ విద్యను అభ్యసించేవారు మాత్రమే నిర్వహించగలరన్నారు. మాజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక బాధ్యతను నిర్వహించడంలో సోషల్ వర్క్ విద్యార్థులు ఎప్పుడూ ముందుంటారన్నారు. ఆచార్య సరస్వతి రాజు అయ్యర్ మాట్లాడుతూ అకాడమిక్ విలువల పరంగా సోషల్ వర్క్ విభాగం ఎప్పటికప్పుడు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతోందన్నారు. విభాగాధిపతి, కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య ఎం.త్రిమూర్తి మాట్లాడుతూ 2025లో వరల్డ్ సోషల్ వర్క్ డే థీమ్ అయిన సెంట్రింగ్ ఇంట్రాగేషనల్ సోలిడెర్టీ ఫర్ యండూరింగ్ వెల్‌బీయింగ్ లక్ష్యాలు, ఆశయాలను వివరించారు. ప్రొఫెసర్ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ సోషల్ వర్క్ విద్యార్థులు వారి విద్య విధానంలో భాగంగా విశ్వవిద్యాలయం వెలుపల కూడా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు డాక్టర్ పి.రవికుమార్, డాక్టర్ ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఆచార్య సురేష్‌కుమార్

థైక్వాండో సిటీ లీగ్‌లో సత్తా చాటిన 'విజ్ఞాన్'

చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు అస్మిత ఖేలో ఇండియా–థైక్వాండో సిటీ లీగ్‌లో ప్రతిభ కనబరిచినట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్, ఖేలో ఇండియా సమర్పణలో థైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండ్ ఆంధ్రప్రదేశ్ థైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తెనాలిలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన అస్మిత ఖేలో ఇండియా– థైక్వాండో సిటీ లీగ్‌లో తమ వర్సిటీకు చెందిన విద్యార్థులు 11 పతకాలను కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఇందులో బంగారు పతకం, 5 రజత పతకాలు, 5 కాంస్య పతకాలు ఉన్నాయని తెలిపారు. 62 కేజీల విభాగంలో అషాంటే బంగారు పతకం సాధించిందని తెలిపారు. 67 కేజీల విభాగంలో ఎండీ కరిష్మా, 62 కేజీల విభాగంలో పి.వెంకట కామ్య, 57 కేజీల విభాగంలో ఎన్.యగ్నస్, 73 కేజీల విభాగంలో కళాజోత్స్న, 53 కేజీల విభాగంలో టి.భవ్యశ్రీ విద్యార్థులు రజత పతకాలు సాధించారు. 53 కేజీల విభాగంలో కె.సాయి వర్షిణి, 67 కేజీల విభాగంలో ఎల్.తేజస్విని, 46 కేజీల విభాగంలో పి.వీణా మాధురి, 57 కేజీల విభాగంలో వి.నిఖిల, 67 కేజీల విభాగంలో సి.పద్మిణి కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో వర్సిటీ వీసీ నాగభూషణ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఇరువురు గాయపడిన ఘటన మండలం నారాకోడూరు గ్రామ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పొన్నూరు రూరల్ మండలం జడవల్లి ప్రాంతానికి చెందిన యువకుడు పల్సర్ బైక్ తెనాలి వైపు వెళ్తున్నాడు. నారాకోడూరు యాదవపాలేనికి చెందిన పంచాయతీ మెంబరు దానబోయిన రామాంజనేయులు సుద్దపల్లిలోని పొలంలో నీళ్లు పెట్టి నారాకోడూరులోని ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా తెనాలి రోడ్డులోని శ్రీహరి వాటర్ ప్లాంట్ వద్ద ప్రమాదవశాత్తూ రెండు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. మద్యం మత్తులో ఉన్న యువకుడు, నిర్లక్ష్యంగా వాహనం నడపటం వలన ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిని యువకుడు, నారాకోడూరుకు చెందిన రామాంజనేయులును 108 వాహనం ద్వారా వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలకసంస్థ పరిధిలోని పట్నం బజార్, లాలాపేటల్లో డ్రెయిన్లు పూర్తి స్థాయిలో ఆక్రమణలు చేసుకోవడం వలన వర్షాకాలం సదరు ప్రాంతం ముంపునకు గురవుతుందని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరంలోని హిమని సెంటర్, పట్నంబజార్, లాలాపేట, పూల మార్కెట్ సెంటర్, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, బృందావన్ అపార్ట్‌మెంట్, చాకలి గుంట వరకు పర్యటించి, డ్రెయిన్ల ఆక్రమణలను మంగళవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గాంధీ పార్క్ నుంచి పట్నం బజార్ నుంచి బృందావన్ అపార్ట్‌మెంట్ వరకు వ్యాపార సంస్థలు వ్యర్థాలను డ్రెయిన్‌లో వేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. త్వరలో పట్నంబజార్‌లో డ్రెయిన్ల ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ చేపడతామని వివరించారు. డ్రెయిన్ ఆక్రమణ చేసుకున్న వారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. చాకలి గుంట రోడ్ వంద అడుగులకు విస్తరణ చేసిన అనంతరం జరిగిన ఆక్రమణల తొలగింపు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. గాంధీ పార్క్ దగ్గరలోని మరుగుదొడ్లను పరిశీలించి, అధికంగా రుసుం వసూలుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యటనలో కార్పొరేటర్లు సంకూరి శ్రీనివాసరావు, వేముల జ్యోతి పద్మజ, డీఈఈ నాగభూషణం, బయాలజిస్ట్ రామారావు, ఎస్ఎస్‌లు ఆయూబ్ ఖాన్, రాంబాబు పాల్గొన్నారు.



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ముగిసిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు(ఆంజనేయపేట) వాకింగ్ ట్రాక్ ఎదురు వేంచేసిన శ్రీలక్ష్మీతిరుపతమ్మ– గోపయ్య స్వాముల తిరునాళ్ల మంగళవారం ముగిశాయి. ఉదయం స్వామి అమ్మ వార్లకు పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, నిత్యార్చన కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో హాజరై, మహా అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరావు, కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్, వడ్రాణం హరి బాబు, కసుకుర్తి హనుమంతరావు, ఉప్పుటూరి పేరయ్య, ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయ్‌కుమార్(రాజా), రవికుమార్, బాజీ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేవీఎస్సార్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 12,13వ తేదీల్లో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన రావు బి.ఫార్మసీ, ఫార్మా.డి విద్యార్థులను అభినందించారు. వాలీబాల్, క్యారమ్స్‌లో తమ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి, ట్రోఫీలు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ అజిత్‌బాబును అభినందిస్తూ, పోటీల్లో విజేతలుగా నిలిచిన 12 మంది విద్యార్థులకు ఒక్కక్కరికీ రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి

సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో ప్రజల వినతి

లక్ష్మీపురం: నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, కాల్వలు తీసే కార్మికులు రావడం లేదని, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని సీపీఎం బృందానికి ప్రజలు విన్నవించారు. స్థానిక పాత గుంటూరులో సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 9, 10, 11 డివిజన్‌లలో బృందం పర్యటించింది. సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని తగిన సంఖ్యలో కార్మికులను కేటాయించాలని కోరారు. నగర కమిటీ నాయకుడు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ యానాది కాలనీ ఎక్స్‌టెన్షన్, స్వరాజ్య నగర్‌లో రోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చెన్నం వారి వీధిలో అడ్డ రోడ్లలో కాల్వల్లో మురుగు తొలగించక పోవడంతో రోడ్లపై మురుగు నిలుస్తోందని, దీంతో దోమలు ఎక్కువగా ఉన్నాయని మున్సిపల్ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. శ్రామిక నగర్లో కాల్వల్లో రెండు నెలలుగా వ్యర్థాలు తొలగించడం లేదని దోమల సమస్య తీవ్రంగా ఉందని నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు ఎల్.అరుణ, పాతగుంటూరు శాఖ కార్యదర్శి శనగపల్లి కార్తీక్, నాయకులు కుమార్, టీ రాము పాల్గొన్నారు.

హైవే వెంట వ్యర్థాల తొలగింపు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారి వెంట వ్యర్థాలను తొలగించే కార్మికులు రేడియం జాకెట్స్, గ్లౌజులు ధరించి విధులు నిర్వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ ఆదేశాల మేరకు బయాలజిస్ట్ రామారావు నేతృత్వంలో కాకాని జంక్షన్ నుంచి బుడంపాడు జంక్షన్ వరకు పారిశుద్ధ్య కార్మికులు జాతీయ రహదారి వెంబడి ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలు గుట్టలుగా ఉంటున్నాయని, రాత్రి సమయాల్లో వ్యర్థాలను వేసే వారిని గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యర్థాలకు కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టడం వలన వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుందన్నారు. ప్రధాన రహదారి వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తున్నారని, ఆయా వ్యర్థాల తొలగింపునకు నగరపాలక సంస్థ ప్రత్యేకంగా కార్మికులను కేటాయించుకుని చేస్తున్నామన్నారు. జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది కనుక విధులు నిర్వహించే కార్మికులకు రేడియం జాకెట్స్ అందిస్తున్నామని, వాటిని తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రజలు నగర మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరిస్తూ వ్యర్థాలను రహదారి వెంబడి వేయకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ రాంబాబు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు రేడియం జాకెట్స్, గ్లౌజులు అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే ఇవ్వాలి

రాజుపాలెం(కాకుమాను): గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీపీఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు కోరారు. పెదనందిపాడు మండలంలోని రాజుపాలెం, పాలపర్రు గ్రామాలలో ప్రజా చైతన్య యాత్ర మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఆరు వారాల నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వలేదని దీని వలన అనేక కుటుంబాలు ఆర్థిక సమస్యలతో జీవిస్తున్నారని తెలిపారు. ఉపాధి పనులకు వెళ్లేది పేద,మధ్య తరగతి ప్రజలని అలాంటి వారికి నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలపర్రు ఎస్సీ కాలనీలో సమస్యలు తిష్టవేసుకుని కూర్చున్నాయని ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కాలనీ వాసులు రాత్రి సమయంలో దోమలతో సహవాసం చేయవలసి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కొత్త శివ వెంకటరావు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్ల మోతు రాజేంద్ర పాల్గొన్నారు.



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆర్‌వీఆర్‌జేసీలో వర్క్‌షాప్

గుంటూరు రూరల్: బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్(బీఐఎం)లో సాంకేతికత ఆధారంగా నిర్మాణరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, అందుకు అనుగుణంగా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రివిట్ ఎల్‌సీపీ నిపుణుడు డాక్టర్ సునీల్ నందిపాటి తెలిపారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్ హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ యూసింగ్ ఆటో డెస్క్ రివిట్ అంశంపై వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను, ప్రాముఖ్యం, అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న విధానాలను వివరించారు. భారతదేశంలో నిర్మాణ రంగం రెండవ అతిపెద్ద పరిశ్రమంగా ఎదుగుతుందని, డేటా అనాలిటిక్స్ ఆధారంగా భవన నిర్మాణ డిజైన్‌ను మెరుగుపరిచే అవకాశాలు విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. 2డీ నుంచి 10డీ వర్చువల్ ప్రజెంటేషన్ వరకు బీఐఎం పురోగతి సాధించిందని, రివిట్ సాఫ్ట్‌వేర్ దీనిలో ప్రధాన భూమిక పోషిస్తున్నదని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న అతిపెద్ద ప్రాజెక్టులు బీఐఎం విధానాల ప్రకారమే రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో, అధిక నాణ్యతతో నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడంలో బీఐఎం సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. అద్భుత కట్టడాలు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల సృజనాత్మకతకు, మేధాశక్తికి నిదర్శనమని, కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఏఎస్ ప్రసాద్, డాక్టర్ కృష్ణ సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్ నందిపాటి

క్రీడల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం

గుంటూరు రూరల్: క్రీడా రంగంలో భారతదేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో చాటే విధంగా క్రీడాకారులు తయారవ్వాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాఫ్ట్ బాల్(మెన్) టోర్నమెంట్ పోటీలు మంగళవారం ప్రారంభించారు. నాకౌట్ కం లీగ్ టోర్నమెంట్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ కళాశాలల జట్లను కళాశాల సిబ్బందితో పాటు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ పీ గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ, నాగార్జున యూనివర్సిటీ సెలెక్షన్ కమిటీ మెంబర్స్ డాక్టర్ పి.శ్రీనివాస్, డాకట్ర్ ఎం.బుచ్చిబాబు, డాక్టర్ రాజా మెరిసిన్‌బాబు, జే ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కళాశాల నిర్వాహకులు

యువత ఓటు నమోదు చేసుకోవాలి

పొన్నూరు: 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేయించుకోవాలని పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి టి.వి. విజయలక్ష్మి కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 15వ తేదీ వరకు బీఎల్‌ఓలకు నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. 800 వరకు ఓటర్లు ఉంటే నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓటరు ఇంటి నుంచి రెండు కిలోమీటర్ల పరిధిలో పోలింగ్ కేంద్రం ఆవశ్యకతను తెలియచేయాలని అన్నారు. మరణించిన ఓటరుకు సంబంధించి ఫారం–7 దాఖలు పరిచాలన్నారు. ఫారం–8 ద్వారా ఓటును వేరే పోలింగ్ కేంద్రానికి బదలాయించుకునేందుకు అర్జీ పెట్టుకోవాలని తెలిపారు. సమావేశంలో పెదకాకాని తహసీల్దార్ కె.కృష్ణ కాంత్, చేబ్రోలు తహసీల్దార్ కె.శ్రీనివాస శర్మ, పొన్నూరు మునిసిపల్ కమిషనరు ఎం.రమేష్ బాబు, డెప్యూటీ తహసీల్దార్ కె.రాజా రమేష్ మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి